
4న చంద్రబాబు రాక

» మాడుగులలో 'రా.. కదలి రా' సభ



అనకాపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఫిబ్రవరి 4వ తేదీన జిల్లాకు రానున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఆదివారం మాడుగులలో నిర్వహించే 'రా... కదలి రా!' బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభకు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టీడీపీతోపాటు జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

సెర్ప్ ఉద్యోగులు సమ్మె బాట

» పాడేరు ఐటీడీఏ కార్యాలయం ముందు దీక్షా శిబిరం

» సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



పాడేరులో ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో సెర్ప్ ఉద్యోగులు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఇప్పటి వరకు అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులు, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు తమ సమస్యలపై రోడ్డెక్కిన విషయం తెలిసిందే. ఇప్పుడు గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని 'వైఎస్ఆర్ క్రాంతి పథం'లో పని చేస్తున్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగుల వంతు వచ్చింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని సెర్ప్ ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మె బాట పట్టారు.

స్థానిక ఐటీడీఏ కార్యాలయం ముందు నిరసన దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. తమ సమస్యలను గత మూడేళ్లుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నప్పటికీ పరిష్కరించలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా సర్వీసును రెగ్యులర్ చేయాలని, అందుకు అనుగుణంగా జీవో చేయాలని డిమాండ్ చేశారు.

ఈపీఎఫ్‌పై ఉన్న సీలింగ్‌ను తీసేసి మూల వేతనంపై శత శాతం ఈపీఎఫ్ సదుపాయాలన్ని అమలు చేయాలని, అర్హులందరికీ పదోన్నతులు కల్పించాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టి, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని, పదవీ విరమణ పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న అన్ని రాయితీలు, సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నారాయణ, కోశాధికారి వి.సత్యనారాయణ, నేతలు శెట్టి కృష్ణారావు, మాదెల రవికుమార్, ఎ.శ్రీనివాసరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు



పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పలు రకాల పథకాలను క్షేత్ర స్థాయిలో అమలు చేస్తున్నాం. 23 ఏళ్లుగా ఎన్నో కష్టాలు పడుతూ పనిచేస్తున్నప్పటికీ న్యాయం జరగని పరిస్థితి చాలా ఆవేదన కలిగిస్తున్నది. ప్రజల కోసం, ప్రభుత్వం తరఫున పని చేస్తున్న మమ్మల్ని రెగ్యులర్ చేయమని వేడుకుంటున్నాం. గత మూడేళ్లుగా మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నపటికీ పరిష్కారం కావడం లేదు. దీంతో గత్యంతరం లేక సమ్మె బాట పట్టాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం.

జె.చిన్నారావు, సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

సర్పంచులు నిరసన దీక్ష



సర్పంచుల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు

గ్రామ పంచాయతీలకు సంబంధించి 16 డిమాండ్లను సత్వరమే నెరవేర్చాలంటూ పాడేరు నియోజకవర్గం సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొట్టగుళ్లి ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం పాడేరులో సర్పంచుల నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను వైసీపీ పాలకులు దోచుకొని పంచాయతీలను నిర్వీర్యం చేయడంతోపాటు సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని ధ్వజమెత్తారు.

-8లో

ఆదివాసీ రైతులతో లిచి సాగు

ప్రత్యేక ప్రణాళిక సిద్ధం

» రైతులకు మొక్కలు పంపిణీ

» ఐదేళ్లపాటు శాస్త్రవేత్తల సహాయ సహకారాలు

» చింతపల్లి హెచ్‌ఆర్ఎస్‌లో లిసియాంతస్‌పై ప్రయోగాలు

» ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జానకిరామ్



లిచి తోటను పరిశీలిస్తున్న ఉప కులపతి డాక్టర్ జానకిరామ్

చింతపల్లి, జనవరి 30: ఆదివాసీ రైతులతో లిచి పండ్ల తోటలను సాగు చేయించేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశామని ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ చెప్పారు. మంగళవారం స్థానిక ఉద్యాన పరిశోధన స్థానాన్ని సందర్శించి, ఇక్కడ జరుగుతున్న ప్రయోగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, పరిశోధన స్థానంలో పదేళ్లగా లిచిపై పరిశోధనలు నిర్వహించామన్నారు. పరిశోధన ఫలితాలు విజయవంతం కావడంతో వాణిజ్య సరళిలో లిచి సాగుకు ఆదివాసీ రైతులను ప్రోత్సహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఎంపిక చేసిన రైతులకు మొక్కలు పంపిణీ చేయడంతోపాటు ఐదేళ్ల వరకు పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సహాయ, సహకారాలు అందిస్తారని చెప్పారు. లిచి సాగుకు ఐటీడీఏ సహకారం తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

లిసియాంతస్‌పై ప్రయోగాలు

ఏపీలో తొలిసారి లిసియాంతస్ (కట్ ఫ్లవర్)పై చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానంలో ప్రయోగాత్మక సాగు ప్రారంభించనున్నట్టు ఉపకులపతి డాక్టర్ జానకిరామ్ తెలిపారు. లిసియాంతస్‌కి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉందన్నారు. ఉత్తరభారత దేశంలో జమ్మూకశ్మీర్ రాష్ట్రంలో మాత్రమే లిసియాంతస్‌ను సాగు చేస్తున్నారని, దీని సాగుకు చింతపల్లి ప్రాంత వాతావరణం అనుకూలంగా ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. దీంతో రోసిట వైట్, రోసిట బ్లూపికోటిలో ఆరు రకాలపై స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో అధ్యయనం చేయనున్నామన్నారు. రెండేళ్ల ప్రయోగాత్మక సాగు ఫలితాల ఆధారంగా గిరిజన రైతులకు పరిచయం చేస్తామన్నారు. తొలి దశలో లంబసింగి, అరకు ప్రాంత రైతులతో లిసియాంతస్ సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏడేళ్ల కిందట చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానంలో ప్రారంభించిన ఆర్కిడ్ ప్రాజెక్టును పునరుద్ధరిస్తామన్నారు. ఆర్కిడ్స్ పూల సాగును వచ్చే ఏడాది పర్యాటక ప్రాంత రైతులకు పరిచయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ శివ కుమార్, శాస్త్రవేత్త శెట్టి బిందు పాల్గొన్నారు.



పరిశోధన స్థానంలో ప్రయోగాత్మక సాగు చేపట్టిన లిసియాంతస్ పూలు

అరకులో స్ట్రాబెర్రీ

గంజాయిగుడలో నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్న గిరిజన రైతులు

» ఆధునిక పద్ధతుల్లో సాగు

» అధిక పెట్టుబడి... అంతే స్థాయిలో ఆదాయం



గంజాయిగుడలో గిరిజన రైతులు సాగు చేస్తున్న స్ట్రాబెర్రీ



స్ట్రాబెర్రీ పండ్లు

అరకులోయ, జనవరి 30:

ఇప్పటి వరకు చింతపల్లి మండలానికే పరిమితమైన స్ట్రాబెర్రీల సాగు అరకులోయ మండలానికి కూడా విస్తరిస్తున్నది. అరకులోయ సమీపంలోని గంజాయిగుడలో వున్న 'గిరి గ్రామదర్శిని' పక్కనే స్థానిక గిరిజన రైతులు సుమమారు నాలుగు ఎకరాల్లో స్ట్రాబెర్రీలను సాగు చేస్తున్నారు. సెప్టెంబరు/ అక్టోబరు నెలల్లో మొక్కలు నాటగా, డిసెంబరు నుంచి పండ్ల దిగుబడి వస్తున్నది. స్ట్రాబెర్రీల సాగు, మార్కెటింగ్, ఆదాయ వ్యయాల గురించి రైతుల్లో ఒకరైన బోయ కామేశ్ తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే...



స్ట్రాబెర్రీలను ప్యాకింగ్ చేస్తున్న రైతులు



పొలంలో సేకరించిన స్ట్రాబెర్రీ పండ్లు

చింతపల్లి మండలం లంబసింగి, తాజంగి, చట్టుపక్కల ప్రాంతాల్లో గిరిజన రైతులు స్ట్రాబెర్రీ పంటను సాగు చేస్తూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకుని రెండేళ్ల క్రితం నాతోపాటు మరికొందరు అక్కడకు వెళ్లి పరిశీలించాం. మొక్కల కొనుగోలు, సాగు, సస్యరక్షణ చర్యలు, పండ్ల దిగుబడి, మార్కెటింగ్, తదితర విషయాల గురించి తెలుసుకున్నాం. స్ట్రాబెర్రీ పంటను సాగు చేయాలంటే డ్రిప్ పరికరాలు, నీరు తప్పనిసరి. అదేవిధంగా పొలంలో అడుగు ఎత్తులో బెడ్లు ఏర్పాటుచేసుకుని మల్చింగ్ షీట్లు వేయాలి. మొక్కలను మహారాష్ట్రలోని పుణె ప్రాంతంలోని నర్సరీల్లో కొనుగోలు చేసి తెచ్చుకోవాలి. మొత్తం మీద ఖర్చులు అధికంగా వున్నప్పటికీ పండ్ల దిగుబడి ద్వారా ఎక్కువ ఆదాయం వస్తుందని చింతపల్లి మండల రైతుల నుంచి తెలుసుకున్నాం. మా భూములకు సమీపంలోని గెడ్డలో ఏడాది పొడవునా నీరు ప్రవహిస్తుంటుంది దీంతో మా గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి ఉమ్మడిగా సాగు చేయాలని నిర్ణయించుకున్నాం. 2022 ఆగస్టులో పుణె నుంచి మొక్కలు తీసుకువచ్చి నాటాం. తొలి ఏడాది కావడం, స్ట్రాబెర్రీ కొత్త కావడంతో అనుకున్న మేర దిగుబడి రాలేదు. అయితే పెట్టుబడి మాత్రం వచ్చింది. ఈ అనుభవంతో గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఎకరాకు 20 వేల మొక్కల చొప్పున నాలుగు ఎకరాల్లో 80 వేల మొక్కలు నాటాం. మొక్కల కొనుగోలు, బెడ్ల ఏర్పాటు, మల్చింగ్ షీట్, డ్రిప్ పరికరాలు, ఎరువులు, తదితర ఖర్చులు కలిపి ఎకరాకు ఏడు నుంచి ఎనిమిది లక్షల రూపాయల వరకు అయ్యాయి. డిసెంబరు నుంచి పండ్ల దిగుబడి మొదలైంది. మార్చి

... మిగతా 8వ పేజీలో

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు



సిబ్బంది తరలింపు నుంచి పోలింగ్ వరకు పక్కాగా ఉండాలి

» కలెక్టర్ సుమిత్‌కుమార్

» అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం సెక్టర్ అధికారులతో సమావేశం



(పైన) మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, సమావేశంలో పాల్గొన్న ఎన్నికల సెక్టర్ అధికారులు

పాడేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, స్థితిగతులు, రవాణా సదుపాయాలు, అందు బాటులో ఉన్న సమాచార వ్యవస్థలపై సెక్టర్ అధికారులు అవగాహన కలిగి వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సెక్టర్ అధికారులతో మంగళవారం ఎన్నికల ప్రక్రియ, పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రి తరలింపుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గంలో 54 సెక్టార్లలో 304 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికల సిబ్బందిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పోలింగ్ సిబ్బందిని తరలించడానికి ఏయే రకాల వాహనాలు ఎన్నెన్ని అవసరమో అధికారులను అడిగి నమోదు చేసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాలకు అరకులోయ మండల కేంద్రం ఎంత దూరం, ఎన్ని గంటలు ప్రయాణించాలని సెక్టార్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వాహకులు పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని మధ్యలో ఎక్కడా వాహనాలు ఆగకూడదన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ, ఎన్నికల సిబ్బంది బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి ప్రాధాన్యం ఇవ్వాలని, బస్సులు వెళ్లడానికి అవకాశం గ్రామాలకు జీపులను కేటాయిస్తామన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగానే జిల్లా ఎన్నికల అధికారికి వెంటనే సమాచారం అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపుల నిర్మాణం, మరుగుదొడ్లకు మరమ్మతులు చేపడతామన్నారు. సెక్టర్ అధికారులు మరొకసారి పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వీవీరమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి శివారులో దట్టంగా కురుస్తున్న మంచు

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

పెరుగుతున్న చలి తీవ్రత, దట్టంగా పొగమంచు

» ముంచంగిపుట్టులో 10.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

పాడేరు/ చింతపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గిపోతున్నాయి. దీంతో చలి ప్రభావం క్రమంగా పెరుగుతున్నది. పొగ మంచు దట్టంగా కురుస్తున్నది. మంగళవారం ముంచంగిపుట్టులో 10.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇంకా జి.మాడుగులలో 10.8, పెదబయలులో 12.1, జీకేవీధిలో 12.2, అరకులోయలో 12.4, పాడేరులో 12.9, హుకుంపేటలో 13.4, చింతపల్లిలో 13.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సుమారు వారం రోజుల నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతుండడంతోపాటు ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులతో చలి తీవ్ర అధికం అవుతున్నది. తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు దట్టంగా పొగ మంచు కురుస్తున్నది. లంబసింగి, తాజంగి, ఆర్‌వీనగర్, వంజంగి, తదితర ప్రాంతాల్లో సాయంత్రం నాలుగు గంటల నుంచే శీతల గాలులు వీస్తున్నాయి. వాహనాలకు హెడ్ లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వస్తున్నది. ఇక ఏజెన్సీ వాసులు యథావిధిగా చలి మంటలు, ఉన్ని దుస్తులతో చలిబారి నుంచి శరీరాన్ని కాపాడుకుంటున్నారు.

విశాఖ చేరిన భారత్, ఇంగ్లండ్ జట్లు

పీఎంపాలెంలోని ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో ఫిబ్రవరి 2 నుంచి జరగనున్న టెస్టు మ్యాచ్ కోసం భారత్, ఇంగ్లండ్ జట్ల ఆటగాళ్లు మంగళవారం విశాఖపట్నం చేరుకున్నారు. వీరి రాకతో పండుగ వాతావరణం నెలకొంది. వీరంతా హోటల్ నోవాటెల్‌లో బస చేశారు. బుధ, గురువారం ఇరుజట్ల ఆటగాళ్లు నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి


భారత ఆటగాళ్లు ముఖేష్‌కుమార్, మహ్మద్ సిరాజ్


యశస్వి జైస్వాల్, జస్ప్రీత్ బుమ్రా


శ్రేయాస్ అయ్యర్


అశ్విన్, శుభంగిల్


కేఎస్ భరత్


ఇంగ్లండ్ ఆటగాళ్లు

క్రైం... crime news

వృద్ధురాలిపై హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జనవరి 30: పట్టణంలో ఒంటరిగా ఇంట్లో ఉన్న వృద్ధురాలిపై హత్యాయత్నం చేసి బంగారం దోచుకువెళ్లిన ఘటనలో నిందితుడిని మంగళవారం పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. పట్టణంలోని ఓ ఇంట్లో కర్రి లక్ష్మీనారాయణమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసముంటున్నారు. ఆమె కుమార్తె నాగ చంద్రిక, అల్లుడు కాండ్రేగుల మురళి ఈ నెల 26వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో లక్ష్మీనారాయణమ్మను చూసేందుకు వచ్చారు. ఆమె స్పృహ తప్పి ఉండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరుడు కిశోర్‌కుమార్‌కు చంద్రిక చెప్పింది. ఆరోగ్యంగా ఉంటున్న తన తల్లికి ఇంతలో ఏమైందని అనుమానం వచ్చి కిశోర్‌కుమార్ తన సెల్‌ఫోన్‌కు కనెక్ట్ అయి ఉన్న సీసీ కెమెరాను చూశారు. తన తల్లి ఇంటి సమీపంలో ఉంటున్న సిటీ కేబుల్ టెక్నీషియన్ మళ్ల గోవింద్ ఈ నెల 26న ఇంట్లోకి ప్రవేశించి తువ్వాలుతో తన తల్లి మెడను బిగించి ఆమె మృతి చెందిందని భావించి బంగారంతో పరారైనట్టు గుర్తించారు. జరిగిన విషయాన్ని పట్టణ పోలీసులకు కిశోర్‌కుమార్ ఫిర్యాదు చేయగా, పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితుడు మళ్ల గోవింద్‌ను అనకాపల్లి పట్టణంలో మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నందుకు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4.1 లక్షలు సీజ్

సబ్బవరం, జనవరి 30: ఎటువంటి పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.4.1 లక్షల నగదును సబ్బవరం పోలీసులు సీజ్ చేసి, ఇద్దరిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ పి.రమణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారి మర్రిపాలెం చెక్‌పోస్టు వద్ద సోమవారం రాత్రి సీఐ పి.రమణ, ఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయనగరం నుంచి రామచంద్రపురం వెళుతున్న కారును ఆపి తనిఖీ చేశారు. కారులో ఉన్న రూ.4.1 లక్షల నగదును పట్టుకొని అందులో ఉన్న ఇద్దరిని ప్రశ్నించారు. ఆ నగదుకు సంబంధించి ఎటువంటి రసీదులు, పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని సీఐ తెలిపారు. కారులో ఉన్న తూర్పుగోదావరి జిల్లా కాకినాడ దరి కొవ్వూరుకు చెందిన పడాల సత్యనారా యణ(60), రామచంద్రాపురానికి చెందిన పడాల సాయిబాబా(56)ను అరెస్టు చేసి మండల మేజిస్ట్రేట్ కోర్టుకు మంగళవారం కేసును బదిలీ చేసినట్టు తెలిపారు. సోమవారం వారిద్దరూ రామచంద్రాపురం నుంచి విజయనగరంలో జరిగిన ఒక వేలంలో పాల్గొనేందుకు వెళ్లి తిరిగి వస్తున్నట్టు తమ విచారణలో చెప్పారన్నారు. నగదుకు సంబంధించిన పత్రాలు చూపిస్తే మండల మేజిస్ట్రేట్ నగదును ఇస్తారన్నారు. లేకుంటే ట్రెజరీకి జమచేస్తారని సీఐ తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వలంటీర్ మృతి

మునగపాక, జనవరి 30: మండలంలోని రామగిరి గ్రామంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ పైనుంచి పడి వలంటీర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వలంటీర్ వాయిబోయిన అప్పలరాజు(33) మంగళవారం గ్రామానికి వస్తున్న ఒక ట్రాక్టర్‌లో కూర్చున్నాడు. ప్రమాదవశాత్తూ పైనుంచి కొంద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతనిని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

48 మద్యం బాటిళ్లు స్వాధీనం

సబ్బవరం, జనవరి 30: మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో మంగళవారం పోలీసులు దాడులు చేసి 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... సీఐ పిన్నింటి రమణ ఆదేశాల మేరకు సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. మలునాయుడుపాలేనికి చెందిన బైలపూడి బంగారయ్య 48 మద్యం బాటిళ్లను గోనె సంచిలో పెట్టి నడుచుకుంటూ మలునాయుడుపాలెం వెళుతుండగా గుల్లేపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతనిని అరెస్టు చేసి అనకాపల్లి సబ్ జైలుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

తానాంలో ఎనిమిది మద్యం సీసాలు..

పరవాడ: మండలంలోని తానాం గ్రామంలో గల ఓ పాన్‌షాపులో ఎనిమిది మద్యం సీసాలను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. పాన్‌షాపులో మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్టు చెప్పారు. ఈ దాడిలో ఎనిమిది క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని షాపు యజమాని దుంగల నాయుడుబాబుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కారులో ఆరు మద్యం బాటిళ్లు

సబ్బవరం: ఒడిశా నుంచి మద్యం బాటిళ్లతో కారులో వస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ రమణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జాతీయ రహదారి మర్రిపాలెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా అటుగా కారు వచ్చింది. దాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో ఆరు మద్యం బాటిళ్లు ఉన్నాయి. ఆ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒడిశా రాష్ట్రంలోని జగత్సింగ హాపూర్ మండలానికి చెందిన తుషార్ రంజన్ మిశ్రాను అరెస్టు చేశారు. అతను ప్రస్తుతం ప్రకాశం జిల్లా సింగరాయిలో నివాసముంటున్నాడు. స్వగ్రామం నుంచి సింగరాయికి కారులో మద్యం బాటిళ్లతో వెళుతుండగా పట్టుబడ్డాడు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం

అనకాపల్లి టౌన్, జనవరి 30: స్థానిక రింగురోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అధ్యక్షతన జిల్లా నూతన కార్యవర్గం ఎంపికైంది. జిల్లా గౌరవాధ్యక్షుడిగా బుద్ద భూలోకనాయుడు, అధ్యక్షుడిగా కొణతాల చంద్రరావు, ఉపాధ్యక్షుడిగా పిట్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా కె.రాజు, కోశాధికారిగా శివ, మహిళా కో-ఆర్డినేటర్‌గా బుద్ద చంద్ర, సభ్యులుగా మళ్ల ప్రసాద్, ఆకుల నానాజీ, కర్రి సుబ్రహ్మణ్యం, దాడి బుజ్జి, కర్రి మహలక్ష్మినాయుడులు ఎన్నికయ్యారు. వీరిని బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర సత్కరించి సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

80 ఎకరాలకు మంత్రి టెండర్

- అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద ఆరోపణ
- 1970లో పట్టాలు పొందిన వారిని పక్కనపెట్టి కొత్త వారిని తెరపైకి తెచ్చారు
- విలువ రూ.800 కోట్లు
- ల్యాండ్ పూలింగ్‌లోనూ అక్రమాలు
- సమీకరించిన 1200 ఎకరాల్లో 400 ఎకరాలు గుడివాడ అమర్‌నాథ్ బినామీలదే
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ. చిత్రంలో అయ్యన్నపాత్రుడు, గండి బాబ్జీ

విశాఖపట్నం, జనవరి 30: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల సమీపంలో 80 ఎకరాల డీఫారం భూములు కొట్టేసేందుకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ యత్నిస్తున్నారని అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. మంగళవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఎంఏఎల్ కళాశాలను ఆనుకుని ఉన్న భూములకు 1970లో అప్పటి ప్రభుత్వం పిసినికాడ గ్రామస్థులకు డీ.ఫారం పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే ఆ భూమి అనకాపల్లి పట్టణానికి ఆనుకుని ఉండడంతో ఇప్పుడు దాని విలువ రూ.కోట్లలోకి చేరిందన్నారు. ఇటీవల ప్రభుత్వం డీఫారం పట్టా భూములను రైతులకు రిజిస్ట్రేషన్ చేయాలని జీవో ఇచ్చిన నేపథ్యంలో మంత్రి అమర్‌నాథ్ ఆ 80 ఎకరాలపై కన్నేశారన్నారు. గతంలో డీ.పట్టాలు పొందిన వారి పేర్లు రికార్డుల్లో మార్చేసి కొత్త వ్యక్తుల పేర పట్టాలు సృష్టించారని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. ఇప్పుడు ఆ నకిలీ వ్యక్తుల పేరన భూములు క్రమబద్ధీకరణకు మంత్రి యత్నిస్తున్నారని, అందుకు జిల్లా కలెక్టర్ కూడా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని 80 ఎకరాలు 1970లో పట్టాలిచ్చిన రైతులకే చెందేలా ఆదేశాలివ్వాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ భూముల విలువ రూ.800 కోట్లు ఉంటుందన్నారు.

అలాగే గూడు లేని పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం అనకాపల్లి పరిసరాల్లో 1200 ఎకరాలు ప్రభుత్వం తీసుకుంటే...అందులో 400 ఎకరాలు మంత్రి బినామీలదేనన్నారు. ల్యాండ్ పూలింగ్ జరగనుందని ముందుగా తెలుసుకొని పేద ఎస్సీ, ఎస్టీ రైతులను బెదిరించి తక్కువ రేటుకు భూములు కాజేసి పూలింగ్‌కు ఇచ్చేశారన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోలేదన్నారు. మంత్రి చేతిలో అనకాపల్లి కలెక్టర్ కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అక్రమాలపై సీఐడీకి ఫిర్యాదు చేశానన్నారు. దీని వెనుక ఆర్డీఓ, మరికొంతమంది రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. అయితే మంత్రి ఒత్తిడితో అన్ని శాఖలు విచారణ తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆరోపించారు. కశింకోట మండలం విస్సన్నపేటలో 600 ఎకరాల భూకుంభకోణంపై విచారణ జరిపిన అధికారులు...ఇప్పటికీ నివేదిక బయటపెట్టలేదని పేర్కొన్నారు. అనకాపల్లి మండలంలో ల్యాండ్ పూలింగ్‌లో చోటుచేసుకున్న అక్రమాలపై రెండేళ్ల నుంచి తాను ఫిర్యాదు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వీటన్నింటిపై సీనియర్ అధికారితో విచారణ జరపాలని గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు గండి బాబ్జీ, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, పార్టీ నేతలు పీలా శ్రీనివాస్, బొత్సా విజయ్‌కుమార్, మళ్ళ సురేంద్ర పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్‌లో మందకొడిగా క్రషింగ్

- బాయిలర్ హౌస్‌లో సాంకేతిక లోపం వల్ల రెండు సార్లు అంతరాయం
- యార్డులో భారీగా నిలిచిపోయిన చెరకు బళ్లు


గోవాడ యార్డులో నిలిచిన చెరకు బళ్లు

చోడవరం, జనవరి 30: గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో సాంకేతిక సమస్యల కారణంగా రెండు సార్లు క్రషింగ్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో మందకొడిగా క్రషింగ్ సాగుతోంది. బాయిలింగ్ హౌస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా సోమవారం రాత్రి క్రషింగ్ నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. దీంతో క్రషింగ్ నిలిచిపోయింది. మరమ్మతులు చేపట్టి తిరిగి మంగళవారం తెల్లవారుజామున క్రషింగ్ ప్రారంభించిన కొద్దిసేపటికే మరోసారి అంతరాయం ఏర్పడింది. మళ్లీ మరమ్మతులు చేసి మధ్యాహ్నం క్రషింగ్ ప్రారంభించారు. కాగా గోవాడలో క్రషింగ్ ఆలస్యంగా సాగుతుండడంతో యార్డులో చెరకు బళ్లు భారీగా నిలిచిపోయాయి. ఇదే సమయంలో కాటాల వద్ద కూడా చెరకు ఎక్కువ రోజులు నిల్వ ఉండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్మార్ట్ సిటీ పనుల అడ్డగింతకు సన్నద్ధం

- నేటి నుంచి ఆందోళనలు కొనసాగించాలని రైతుల నిర్ణయం


స్మార్ట్ సిటీకి కేటాయించిన స్థలంలో రోడ్డు పనులు

అచ్యుతాపురం, జనవరి 30:
అచ్యుతాపురం - గాజువాక ప్రధాన రహదారిలో ఏర్పాటు చేయబోయే స్మార్ట్‌సిటీ పనులను అడ్డుకునేందుకు కొందరు రైతులు సన్నద్ధమవుతున్నారు. బుధవారం నుంచి ఆందోళనలు కొనసాగించాలని వారు నిర్ణయించుకున్నారు. ఉమ్మడి చోడపల్లి పంచాయతీతో పాటు బోగాపురం పంచాయతీ రెవెన్యూలో గల సుమారు 66 ఎకరాల ప్రభుత్వ భూమికి దశాబ్దాల క్రితం రామన్నపాలెం, అప్పన్నపాలెం, భోగాపురంలో గల నిరుపేద రైతులకు పట్టాలిచ్చారు. అప్పటి నుంచి వీరు వాటిని సాగుచేసుకుంటూ జీవిస్తున్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో స్మార్ట్ సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచించింది. దీంతో వైసీపీ నాయకులు పావులు కదిపి రైతులు సాగుచేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వ భూమి కనుక ఇక్కడ స్మార్ట్ సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఈ ప్రభుత్వ భూమి చుట్టుపక్కల వైసీపీ నాయకులకు చెందిన రియల్ ఎస్టేట్ భూములు ఉండడమే దీనికి కారణం. అయితే గాజువాక - అచ్యుతాపురం ప్రధాన రహదారి నుంచి వైసీపీ నాయకుల భూములకు ప్రధాన రహదారి లేదు. స్మార్ట్ సిటీ అభివృద్ధి చేస్తే తమ భూములకు రహదారులు ఏర్పడతాయని భావించి ఈ ఎత్తువేశారు. ఇప్పటికే గాజువాక - అచ్యుతాపురం ప్రధాన రహదారి నుంచి స్మార్ట్ సిటీకంటూ 40 అడుగుల రోడ్లకు మార్కింగ్‌లు కూడా చేసేశారు. 2023 కన్నా ముందు డి పట్టాలు పొందిన ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరణ చేయవచ్చంటూ జగన్ ప్రభుత్వం చట్టం తెచ్చింది. దీంతో ఇక్కడ ఎకరా ధర రూ.4 కోట్లకు పెరిగింది. దీంతో ఇక్కడ ఒక వైసీపీ నాయకుడు రైతులను బెదిరించి సుమారు 4.70 ఎకరాల భూమిని అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. మారిన చట్టం ప్రకారం అధికారికంగా రిజిస్ట్రేషన్ చేసుకొని ప్రస్తుతం లేఅవుట్‌గా మర్చి విక్రయాలు ప్రారంభించారు. అయితే రైతులు కూడా ఇదే విధంగా జిరాయితీలుగా మార్చుకోవాలని ప్రయత్నించారు. కానీ మిగిలిన భూమి స్మార్ట్ సిటీకి కేటాయిస్తున్నామని, అందువల్ల రిజిస్ట్రేషన్లు జరగవని అధికారులు ప్రకటించటంతో ఆర్థిక స్థోమత ఉన్న రైతులు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ప్రస్తుతం అధికారులు స్టే తెచ్చుకున్న రైతుల భూములను మినహాయించి మిగిలిన భూములను అధికారులు చదును చేస్తున్నారు. రైతులు అడ్డుకోవడంతో పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. కాగా రైతుల అంగీకారంతోనే స్మార్ట్‌సిటీ పనులు ప్రారంభించామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. కొంతమంది కోర్టును ఆశ్రయించారని, వారి భూములను వదిలి మిగతావి చదును చేస్తున్నామన్నారు. ఎన్నికల విధుల కారణంగా పనులు ఆలస్యమయ్యాయని ఆయన తెలిపారు.

ఎన్నికల విధులను అంకితభావంతో నిర్వహించాలి

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ


డైరీని ఆవిష్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 30 : ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల్లో తమకు కేటాయించిన విధులను సిబ్బంది అంకితభావంతో నిర్వహించాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసులకు రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక రింగురోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎన్నికల శిక్షణ పొందిన అధికారులు, జిల్లా పోలీసులకు, సెక్టార్ పోలీసులకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల విధి విధానాలు, నియమ నిబంధనలు, సంబంధిత చట్టాలు తదితర అంశాలపై పోలీస్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని వారికి సూచించారు. ఎన్నికల విధి విధానాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను ఎస్పీ స్వయంగా వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగిసే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ముద్రించిన పోలీస్ డైరీని ఎస్పీ ఆవిష్కరించి అధికారులకు, అసోసియేషన్ సభ్యులకు అందజేశారు. ఈ సమావేశంలో నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, అదనపు ఎస్పీలు బి.వి జయభాస్కర్, పి.సత్యనారాయణరావు, డీఎస్పీలు వి.సుబ్బరాజు, కేవీ సత్యనారాయణ, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిఘా ముమ్మరం చేయాలి

అనకాపల్లి రూరల్: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నిఘాను ముమ్మరం చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్టు కేసులు, 174 సీఆర్‌పీసీ కేసులు, గంజాయి కేసులలు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉండడానికి కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది అధికారులు, సిబ్బందికి ఆయన ప్రశంసాపత్రాలు ఇచ్చి సత్కరించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణ రావు, నర్సీపట్నం సబ్‌డివిజన్ అధికారి అదిరాజ్‌సింగ్‌రాణా, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలిండియా పోలీస్ కమాండో పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఏపీ


చాంపియన్‌గా నిలిచిన ఆంధ్ర జట్టుకు ట్రోఫీ బహూకరిస్తున్న ఇంటెలిజెన్స్ బ్యూరో అదనపు డైరెక్టర్ మహేష్‌దీక్షిత్

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 14వ ఆలిండియా పోలీస్ కమాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. విశాఖలోని గ్రేహౌండ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఈనెల 22న ప్రారంభమైన పోటీలు మంగళవారం ముగిశాయి. ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు పర్యవేక్షణలో పది ట్రోఫీల కోసం దేశవ్యాప్తంగా ఉన్న 23 జట్లు పోటీపడ్డాయి. ఏఓబీ/చత్తీస్‌ఘడ్ సరిహద్దు నక్సల్స్ ప్రభావిత దట్టమైన అడవుల్లో గెరిల్లా యుద్ధవ్యూహాలు, నైపుణ్యంలో ఏపీ గ్రేహౌండ్స్ కమాండోల జట్టు ప్రథమ స్థానం దక్కించుకుంది. దీంతోపాటు మొత్తం పదింటిలో ఐదు ట్రోఫీలు, బెస్ట్ స్టేట్ పోలీస్ కమాండో టీమ్, చక్రవ్యూహం-1 రూల్, బెస్ట్ బ్లాక్‌హాక్‌ఫైరింగ్, టీమ్ ఇన్ కాన్ఫిడెన్స్ విభాగాల్లో విజేతగా నిలిచి ఏపీ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో రాజస్థాన్ దక్కించుకున్నాయి. విజేతలకు ఇంటెలిజెన్స్ బ్యూరో అదనపు డైరెక్టర్ మహేష్‌దీక్షిత్, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్‌అయ్యన్నార్, గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ ఆర్కే మీనా, గ్రేహౌండ్స్ డీఐజీ కోయ ప్రవీణ్, తదితరులు బహుమతులు అందజేశారు.

11న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

ఎలమంచిలి, జనవరి 30: ప్రముఖ గాయకుడు ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 11న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడారి పూరిజగన్నాథం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలమంచిలి ఘంటసాల కళామందిర్‌లో ఘంటసాల వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా పాటల పోటీలను సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదుతో పాటు సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి స్థానిక కళాకారులతో ఘంటసాల సినీ సంగీత విభావరి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9390877174, 9866307171 ఫోన్ నంబర్లను సంప్రతించాలని కోరారు.

హాకీ జిల్లా జట్ల ఎంపిక రేపు

ఎలమంచిలి, జనవరి 30: ఎలమంచిలి రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో ఫిబ్రవరి 1వ తేదీన జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల హాకీ జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని హాకీ జిల్లా చైర్మన్ ఆడారి వీరునాయుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక హాకీ అసోసియేషన్ ప్రతినిధి కొరారు నరేశ్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జూనియర్(బాలికల)విభాగంలో పాల్గొనేందుకు 2005 సంవత్సరంలో పుట్టిన వారు, సబ్ జూనియర్(బాలురు)విభాగంలో పాల్గొనేందుకు 2008 నుంచి పుట్టిన వారు అర్హులని తెలిపారు. ఈ జట్ల ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని కోరారు.

జిల్లా రగ్బీ జట్టు ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన జిల్లా రగ్బీ జట్టు


అచ్యుతాపురం, జనవరి 30: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అనకాపల్లి జిల్లా సబ్‌జూనియర్ రగ్బీ జట్టు ఎంపిక మంగళవారం స్థానిక మండల కాంప్లెక్స్ గ్రౌండ్‌లో జరిగింది. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన 24 మంది బాల, బాలికలను జిల్లా కోచ్ వెంకట్ ఎంపిక చేశారు. ఫిబ్రవరి మూడు, నాలుగు తేదీల్లో విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయి. ఈ కార్యక్రమంలో కూండ్రపు వెంకునాయుడు, కోన బుజ్జి, రెడ్డి గణేశ్, వెంకట్, సుధీర్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని సెర్ప్ ఉద్యోగుల ఆందోళన


కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, జనవరి 30: పట్టణంలో సెర్ప్ ఉద్యోగులు మంగళవారం వినూత్న రీతిలో ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రభుత్వం ఇప్పటికే సెర్ప్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించిందని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ డిమాండ్లను అమలు చేయాలని సెర్ప్ జేఏసీ ప్రతినిధి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ జేఏసీ ప్రతినిధులు వాసు, గోవిందమ్మ, శ్రీనివాస్, రమణ, సత్యవతిలు పాల్గొన్నారు. సెర్ప్ ఉద్యోగుల ఆందోళన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సందర్శించి సంఘీభావం తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సెర్ప్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా పీలా పేర్కొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రోగులకు ఉచితంగా మందులు


డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కుమార్

నర్సీపట్నం, జనవరి 30: ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు వైద్య నిపుణులు రాసిన మందులు ప్రభుత్వాస్పత్రుల్లో దొరక్కపోతే ఎంత ఖరీదైనా కొనుగోలు చేసి ఇస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన అర్బన్ పీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 1.9 లక్షల మంది వైద్య సేవలు పొందినట్టు తెలిపారు. రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇప్పటికి 35 వేల మంది లబ్ధి పొందారని తెలిపారు. కంటి సమస్యలతో ఉన్న వారిని గుర్తించి 900 కంటి ఆపరేషన్లు చేయించామని, 17 వేల మందికి కంటి అద్దాలు అమర్చామన్నారు. ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు 5.12 లక్షల మంది ఉండగా, 4.76 లక్షల కార్డులు వచ్చాయని, వాటిలో 2.6 లక్షల మందికి వలంటీర్ల ద్వారా పంపిణీ చేశామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

సుప్రీం కోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, జనవరి 30: ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. మంగళవారం విలేకరుల ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టి వేయడం ఆనందకరమన్నారు. ఈ తీర్పు చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. సుప్రీం కోర్టు చేసి వ్యాఖ్యలకు జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ జగన్ ప్రభుత్వం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా ఎప్పటికైనా నిజం గెలుస్తుందన్న విషయం జగన్ రెడ్డి గుర్తించాలన్నారు. ప్రజలు చంద్రబాబు వెంటే ఉన్నారని, వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమెలి చిట్టిబాబు, కేవీ.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలను కాపాడుకోవాలి



హుకుంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పాడేరు రూరల్, జనవరి 30: గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు కోరారు. మంగళవారం పాడేరులో జరిగిన సంస్కృతి పరిరక్షణ యాత్ర ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు అబివృద్ధి పదంలో కొంత మేరకు ముందుకు వస్తున్నప్పటికీ సంస్కృతీ సంప్రదాయాలను మాత్రం మరువరాదన్నారు. పండగల సమయంలో ఆచార వ్యవహారాలను కొనసాగించాలన్నారు. అనంతరం వనవాసీ రాష్ట్ర ప్రతినిధి సోమయాజులు మాట్లాడుతూ పిల్లలకు గిరిజన పండగల నిర్వహణ, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను నేర్పించాలన్నారు. అనంతరం గిరిజన ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సోమయాజులను ఆలయ కమిటీ ప్రతినిధులు, బీజేపీ నాయకులు సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, పోతురాజు, బీజేపీ నాయకులు కురసా పార్వతమ్మ, మఠం శాంతకుమారి, పాంగి రాజారావు, సల్లా రామకృష్ణ, వేమనబాబు, రాఘవేంద్రరావు, కూడా కృష్ణారావు, నందోలి శివకృష్ణ, వనవాసీ ప్రతినిధులు పాంగి రామయ్య, మఠం సూర్యనారాయణ నాయుడు, ఉబ్బేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో ర్యాలీ

హుకుంపేట: మండల కేంద్రంలో మంగళవారం గిరిజన సంప్రదాయాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలను అందరూ అనుసరించాలని ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కన్వీనర్ కురుసా పార్వతమ్మ పిలుపునిచ్చారు. అలాగే తమ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పిల్లలకు వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాంగి రాజారావు, యు.నాగేశ్వరావు, రామస్వామి, మత్స్యకొండబాబు పాల్గొన్నారు

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలుగా బి.కెజియారాణి



బి.కెజియారాణికి నియామకపత్రం ఇస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

పాడేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలుగా బి.కెజియారాణిని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శంకరరావు నియమించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నియామపత్రాన్ని అందించారు. బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి కె.సురేశ్, విశ్వబ్రాహ్మణ సంఘం డివిజన్ అధ్యక్షుడు కొమ్మోజు వెంకటరమణ, నేతలు సున్నం సత్యనారాయణ, సంతోశ్, హరీశ్, నానాజీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జేసీ కార్తీక్‌కు ఘనంగా వీడ్కోలు



జేసీ కార్తీక్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, అధికారులు

పాడేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి తాజా బదిలీల్లో విజయనగం వెళుతున్న కె.కార్తీక్‌కు కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్‌వో వీవీ.రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.అంబేడ్కర్, పి.మురళీకృష్ణ, వీవీఎస్.శర్మ, తదితరులు కార్తీక్‌కు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కలెక్టర్ సుమిత్‌కుమార్ కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

2న ముంచంగిపుట్టు సర్వసభ్య సమావేశం

ముంచంగిపుట్టు, జనవరి 30: మండల పరిషత్ సమావేశ మందిరంలో వచ్చే నెల 2న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో కిరణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో సమస్యల పరిష్కారం, భవిష్యత్ ప్రణాళిక తదితర అంశలపై సమావేశంలో చర్చించనున్నామన్నారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

వైసీపీ ప్రభుత్వంలో గిరిజనులకు అన్యాయం

» జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు

రోలుగుంట, జనవరి 30: వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ రాజు అన్నారు. మండలంలోని కొంతలం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన గిరిజన సదస్సులో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గిరిజనుల జీవన స్థితి అత్యంత అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాలకు కనీసం రోడ్లు కూడా వేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. చీమలపాడు పంచాయతీ గిరిజనులకు విద్య, వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను దళారులు ఆక్రమించుకుని అన్యాయం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వానికి మద్దతు ప్రకటించి గెలిపిస్తే నియోజకవర్గంలో అన్ని గిరిజన గ్రామాలను శతశాతం అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు కేసరపూడి శివాజీ, మైచర్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులను ప్రభుత్వం దోచుకుంటోంది..

» పీఆర్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు

» పాడేరులో సర్పంచుల నిరసన దీక్షలు



మహాత్మా గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు

పాడేరు రూరల్, జనవరి 30: గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేటాయించిన నిధులను వైసీపీ ప్రభుత్వం దోచుకుంటున్నదని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు అన్నారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొట్టగుళ్లి ఉషారాణి అధ్యక్షతన పాడేరులో మంగళవారం సర్పంచుల నిరసన దీక్షలను ప్రారంభించారు. ముందుగా జాతాపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15, 16వ ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో గ్రామాల్లో చిన్నపాటి అభివృద్ధిని కూడా చేయలేక సర్పంరులు ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు సేవలు అందించాలని, పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించి రాజకీయంగా ఎదగాలన్న సర్పంచుల ఆశలు, ఆశయాలపై జగన్‌రెడ్డి నీరు చల్లారని వాపోయారు. గ్రామ వలంటీర్లకు బాధ్యతలను అప్పగించి సర్పంచుల గౌరవ ప్రతిష్ఠలను మంటగలిపారని విమర్శించారు. ఇప్పటికైనా సర్పంచుల న్యాయమైన 16 డిమాండ్‌లను నెరవేర్చాలని, పంచాయతీ నిధులను సర్పంచుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. పాడేరు సర్పంచ్ ఉషారాణి, బాకూరు సర్పంచ్ వెంకటరమణరాజు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చి సర్పంచులకు నిధులు, విధులు లేకుండా చేసిందన్నారు. పంచాయతీల నిధులను సైతం జగన్ ప్రభుత్వం దోచుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు వర్తన పిన్నయ్యదొర, బొర్రా విజయరాణి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, నాయకులు జిల్లా అధికార ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు, సాగర సుబ్బారావు, త్రినాథ్, అచ్చిబాబు, తిరుపతి, స్వామి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించండి

» ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం చేయాలి

» ఐటీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు నారాయణరావు



శిబిరంలో మాట్లాడుతున్న ఐటీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు నారాయణరావు

అరకులోయ, జనవరి 30: నియోజకవర్గంలో పరిధిలోని ప్రతీ గ్రామానికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని ఐటీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కోరాడ నారాయణరావు సూచించారు. అరకులోయలోని ఓ ఫంక్షన్ హాలులో పార్టీ శ్రేణులకు ఇంటిగ్రెటెడ్ శిక్షణా తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం చేయాలన్నారు. తద్వారా ప్రజలను పార్టీకి ఆకర్షితులను చేయాలని కోరారు. పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ లక్ష్యాలను అధిగమించాలంటే క్లస్టర్, బూత్, యూనిట్ కమిటీల ఇన్‌చార్జులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలకు సమయం చాలా తక్కువగా ఉన్నందున ఇప్పటి నుంచే ప్రజల వద్దకు వెళ్లి పార్టీ పథకాలు, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ తోకల సత్తిబాబు, ట్రైనర్ కొర్రా కృష్ణారావు, కురుపాం అసెంబ్లీ ఐటీడీపీ ఇన్‌చార్జి సుఖేస్‌పాండా, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, ఆరు మండలాల నాయకులు అమ్మన్న, శెట్టి బాబూరావు, సుబ్బారావు, నీరజ, నిర్మల, సాయిరాం, క్లస్టర్, బూత్, యునిట్ కమిటీల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతులకు హాజరైన క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జులు

ఆదివాసీ రైతుల చెంతకే పరిశోధన ఫలితాలు

» ఎన్‌జీవోలతో ప్రత్యేక కార్యాచరణకు ప్రణాళిక

» రిటైర్డ్ ఏడీఆర్ డాక్టర్ టి.రత్నసుధాకర్



గిరిజన రైతుల వ్యవసాయ ప్రగతికి వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తలు, పీహెచ్‌డీ స్కాల

చింతపల్లి, జనవరి 30: ఆదివాసీ రైతుల చెంతకే పరిశోధన ఫలితాలు తీసుకు వెళ్లేందుకు ప్రత్యేక విస్తరణ విభాగాన్ని ఏర్పాటు చేయాలని సిఫారసు చేసినట్టు రిటైర్డ్ ఏడీఆర్, టెక్నాలజీ జనరేషన్ విభాగం చైర్మన్ డాక్టర్ టి.రత్నసుధాకర్ చెప్పారు. మంగళవారం రెండో రోజు పరిశోధన స్థానంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ పరిశోధన స్థానం, కేవీకే, డాట్ సెంటర్లలో ఆవిష్కరించిన నూతన సాంకేతికత రైతులు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాస్త్రవేత్తల ప్రయోగాల ఫలితాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ అనుబంధశాఖలు పనిచేస్తున్నాయన్నారు. అయితే ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఎన్జీవోలు, ఎఫ్‌పీవోల సహకారంతో రైతుల వ్యవసాయ ప్రగతికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు చేపట్టిన పరిశోధన ఫలితాలు, నూతన సేద్య విధాన పద్ధతులు రైతులకు చేరవేసే బాధ్యతలను ఎన్‌జీవోలకు అప్పగించాలన్నారు. పలు రాష్ట్రాల శాస్త్రవేత్తలు జాతీయ సదస్సులో సిఫారసు చేసిన కొత్త రకం పంటలు, సాంకేతిక డాక్యుమెంటరీని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయానికి సమర్పించామన్నారు. స్థానిక ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ సదస్సులో శాస్త్రవేత్తలు అందజేసిన డాక్యుమెంటరీని విశ్వవిద్యాలయం క్షుణ్ణంగా పరిశీలించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏజెన్సీలో అమలుపర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ జనరేషన్ విభాగం కో-చైర్మన్ డాక్టర్ దేశగిరి శేఖర్, కన్వీనర్ డాక్టర్ జి.చిట్టిబాబు, టెక్నాలజీ అప్లికేషన్ విభాగం చైర్మన్ డాక్టర్ ఈ.కరుణశ్రీ, కో-చైర్మన్ టీఎస్ఎస్‌కే పాత్రో, కన్వీనర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రాజు, శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, కదిరి మోహన్‌రావు, జోగారావు, సీదరి ఉజ్వలరాణి, శెట్టి బిందు, హెచ్‌ఆర్ఎస్ అధిపతి శివకుమార్ పాల్గొన్నారు.

గిరిజనులకు తప్పని డోలీ మోతలు

» ఐనాడ పంచాయతీ వాసుల అగచాట్లు



అనారోగ్యానికి గురైన వ్యక్తిని డోలీలో తరలిస్తున్న సీకాయపాడు గ్రామస్థులు

పాడేరు రూరల్, జనవరి 30: ఎన్నికల సమయంలో తప్పితే మారుమూల గ్రామాల సమస్యలు పాలకులకు పట్టకపోవడంతో గిరిజనులకు రవాణా కష్టాలు, డోలీ మోతలు తప్పడం లేదు. మండలంలో మారుమూల ఐనాడ పంచాయతీ పరిధిలోని సీకాయిపాడు, రెల్లిబంధ, గాదిపనుకు గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఐటీడీఏ అధికారులకు ఎన్నిమార్లు వినతులు ఇచ్చినా, స్థానిక ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నా పట్టించుకునే పాపానికి పోవడం లేదని గిరిజనులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గడపగడపకు కార్యక్రమాన్ని తమ గ్రామాల్లో పెడితే సమస్యలు తెలుస్తాయని ఎంత ప్రాధేయపడినా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఇటుగా తొంగిచూడలేదని వారు వాపోయారు. చిన్నపాటి అనారోగ్యానికి గురైనా వైద్య సేవల కోసం డోలీలో మోసుకొని ఈదులపాలెం పీహెచ్‌సీకి తరలించక తప్పడం లేదని గిరిజనులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించి రవాణా సేవలను మెరుగుపర్చాలని మూడు గ్రామాల గిరిజనులు వేడుకుంటున్నారు.

తహసీల్దార్ల బదిలీలపై కసరత్తు

» ఏడాది లోపు ఉద్యోగ విరమణ చేయనున్న వారికి మినహాయింపు

అనకాపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండడంతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని రెవెన్యూ శాఖలో అధికారుల బదిలీలకు కసరత్తు మొదలైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో మూడేళ్ల నుంచి పనిచేస్తున్న వారు, ఇదే జిల్లాకు చెందిన వారిని జోన్‌లోని వేరే జిల్లాలకు బదిలీ చేయాలి. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు (విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు) తమ పరిధిలోని తహసీల్దార్ల బదిలీలకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు.

అయితే ఎన్నికల సంఘం నిబంధన ప్రకారం ఏడాదిలోపు పదవీ విరమణ చేయనున్న తహసీల్దార్లకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వను న్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏడాదిలోగా పదవీ విరమణ కానున్న తహసీల్దార్ల పేర్లను ప్రభుత్వం విడుదల చేసింది.

ఏఎస్ఆర్ జిల్లా హుకుంపేట తహసీల్దారు బి.రాజ్యలక్ష్మి, జి.మాడుగుల తహసీల్దారు వీవీవీ గోపాలకృష్ణ, విశాఖపట్నం జిల్లా ములగాడ తహసీల్దారు డీవీ వీరభద్రరావు, అనకాపల్లి జిల్లా సబ్బవరం తహసీల్దారు బి.సత్యనారాయణ, మునగపాక తహసీల్దారు వి.ప్రకాశరావు, అనకాపల్లి తహసీల్దారు పీవీఎల్ఎన్ గంగాధరరావు, పరవాడ తహసీల్దారు పి.కనకారావు, గొలుగొండ తహసీల్దారు వైఎస్‌వీవీ ప్రసాదరావుల పేర్లు ఈ జాబితాలో వున్నాయి. బదిలీల నుంచి వీరికి మినహాయింపు ఇవ్వనున్నారు. ఇంకా అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం ఏవో చంద్రశేఖరరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎం.ఎ.శ్రీనివాస్‌లకు కూడా మినహాయింపు వుంది.

ఖేల్ ఇండియా జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో అరకు క్రీడా పాఠశాల పూర్వ విద్యార్థుల సత్తా



పతకాలతో అరకు క్రీడా పాఠశాల విద్యార్థులు

అరకులోయ, జనవరి 30: ఖేలో ఇండియా వాలీబాల్ పోటీలలో అరకు క్రీడా పాఠశాల పూర్వ విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ పీఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు ఖేలో తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పూర్వ విద్యార్థులు శెట్టి కనిష్క, కొర్రా ప్రవీణ్, కొర్రా నాగరాజు, కొర్రా సంతోష్, పూసం సాహితీ చంద్ పాల్గొన్నారన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానం సాధించారని ఆయన చెప్పారు. వారిని ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్ మాధవ్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి హైజంప్‌లో పాలిటెక్నిక్ విద్యార్థికి గోల్డ్ మెడల్

పాడేరు రూరల్: సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 26వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ కళాశాల క్రీడా పోటీల్లో స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలల మెకానికల్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థి పాంగి రామారావు హైజంప్‌లో ఉత్తమ ప్రతిభను కనపర్చి బంగారు పతకం సాధించాడు. క్రీడాకారుడు రామారావును ప్రిన్సిపాల్ డాక్టర్ .కె.సుజాత, సిబ్బంది అభినందించారు.

కరాటే పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

చింతపల్లి: చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గిరిజన విద్యార్థులు సత్తా చాటి ఐదు బ్లాక్ బెల్టులు సాధించారు. చెన్నైలో జపాన్ గ్రాండ్ మాస్టర్ షైహన్ కెయిజీ టోమియామ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో చింతపల్లి మండలం అన్నవరానికి చెందిన వెలుసూరి అప్పన్న, గూడెంకొత్తవీధి మండలం కొత్తవలస గ్రామానికి చెందిన గుంట రామచంద్రరావు, దేవరాపల్లికి చెందిన దేశగిరి సత్తిబాబు, మొట్టడం సత్య సురేశ్, దొడ్డికొండకు చెందిన కొర్ర లంబన్న ఈ పోటీల్లో బ్లాక్ బెల్టులు సాధించినట్టు కోఫోకాన్ కరాటే జిల్లా ముఖ్య శిక్షకుడు పాండురాజు తెలిపారు. అలాగే ఐదుగురు యువకులకు కరాటే శిక్షణ ఇచ్చేందుకు అర్హత ధ్రువీకరణ పత్రాలు అందించామని చెప్పారు.

సంక్షిప్తంగా..

'జగన్ అరాచక పాలనపై ప్రజలు చైతన్యవంతులు కావాలి'

గూడెంకొత్తవీధి, జనవరి 30: జగన్ అరాచక పాలనపై ప్రజలు చైతన్యవంతులు కావాలని టీడీపీ నాయకుడు కొట్టగుళ్లి సుబ్బారావు అన్నారు. దామనాపల్లి పంచాయతీలో మంగళవారం బాబు షూరిటీ, భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గిరిజన గ్రామాల అభివృద్ధి కుంటుబడిపోయిందన్నారు. వైసీపీకి ఓటు వేసి మోసపోయామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. మరో అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశన మైపోతుందన్నారు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణమ్మ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ముక్కలి కల్యాణి, బుజ్జిబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండజర్తలో వైద్య శిబిరం

సీలేరు, జనవరి 30: మారుమూల కొండజర్త గ్రామానికి మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సుమారు ఆరు కిలోమీటర్ల దట్టమైన అటవీ ప్రాంతంలో వాగులు దాటుకుంటూ వెళ్లి 40 గిరిజనులకు, నలుగురు గర్భిణులకు వైద్య సేవలను అందించారు. ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ధారకొండ పీహెచ్‌సీకి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగమణి, లోవకుమారి, సీత పాల్గొన్నారు.

గ్రంథాలయాలు వినియోగించుకోండి

హుకుంపేట, జనవరి 30: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఆ శాఖ అధికారిణి మానస కోరారు. ప్రభుత్వం అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించి మెటీరియల్, పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. నిరుద్యోగ యువతీ, యువకులు గ్రంథాలయాలకు వచ్చి ఈ పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానం సముపార్జించాలని సూచించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

చింతపల్లి, జనవరి 30: రక్తహీనత కలిగిన విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్‌వీ నగర్ వైద్యాధికారి డాక్టర్ కె.సౌమ్య సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు మంగళవారం హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌బీ శాతం తక్కువగానున్న విద్యార్థినులకు హెచ్‌డబ్ల్యూవోలు ప్రత్యేక పోషకాహారం అందజేయాలన్నారు. గుడ్డు, చిక్కీతో పాటు కూరగాయల ఆహారం పూర్తి స్థాయిలో తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా తమకు సమాచారం ఇవ్వాలని, ఆస్పత్రికి తీసుకొచ్చి మెరుగైన చికిత్స అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి, పీజీహెచ్‌ఎం జేపీ కొండలరావు, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించరూ..

డుంబ్రిగుడ, జనవరి 30: ఉపాధి పథకం కూలి బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి పోతురాజు కోరారు. మండలంలోని సాగర పంచాయతీ అడపవలసలో ఉపాధి కూలీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు, జనవరి నెలలకు సంబంధించి కాఫీ తోటల్లో కూలీలు రాతి కట్టడాల పనులను చేశారన్నారు. ఇప్పటికీ బిల్లులు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వవ్యక్తం చేశారు. దీంతో సంక్రాంతి పండగ చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే బకాయిలను కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూర్యనారాయణ, పూర్ణిమా, బలరాం, నూకరాజు, పాపారావు, రఘు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం ప్రారంభించాలి

» కళాశాల విద్యార్థినుల ఆందోళన

ముంచంగిపుట్టు, జనవరి 30: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన మహిళా పోస్టుమేట్రిక్ హాస్టల్ భవనాన్ని తక్షణమే ప్రారంభించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ కె.రాజశేకర్ డిమాండ్ చేశారు. నూతన భవనం ప్రారంభోత్సం చేయాలని డిమాండ్ చేస్తూ కళాశాల విద్యార్థినులు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ భవన నిర్మాణం పనులు పూర్తయి సుమారు ఏడాది కావస్తుందని, అయినప్పటికీ అధికారులు భవనం ప్రారంభోత్సవం చేయకపోవడం విచారకరమని వాపోయారు. దీంతో విద్యార్థినులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వవ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కామేష్, అమృత, రోహిణి, మేఘన, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అరకులో స్ట్రాబెర్రీ

... 5వ పేజీ తరువాయి

వరకు కాపు వుంటుంది. ఒక్కో మొక్కకు 400 నుంచి 600 గ్రాముల వరకు దిగుబడి వస్తుంది. ఎకరాకు ఎనిమిది నుంచి పది వేల కిలోల దిగుబడి వస్తుంది. సగటున కిలో రూ.250లకు విక్రయిస్తున్నాం. ఎకరాకు రూ.15-18 లక్షల వరకు ఆదాయం వస్తుందని ఆశిస్తున్నాం. రోజూ 400 నుంచి 600 కిలోల వరకు స్ట్రాబెర్రీని సేకరించి, 200 గ్రాముల చొప్పున ప్యాకింగ్ చేసి విశాఖపట్నం, విజయనగరం, రాజమహేంద్రవరం, కాకినాడ, తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాం. నాలుగు ఎకరాల్లో కలుపు తీయడం, నీరు పెట్టడం, పండ్లను సేకరించడం, గ్రేడింగ్ చేసి ప్యాకింగ్ చేయడం, వంటి పనుల ద్వారా 25 నుంచి 30 మంది ఉపాధి పొందుతున్నారు.